క్లుప్తంగా

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్



శ్రీరాములుతో నూతన కార్యవర్గ సభ్యులు

మీర్‌పేట: రానున్న స్థానిక ఎన్నికలలో పార్టీ విజయం కోసం శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్‌-2 అధ్యక్షుడు ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మంగళవారం శ్రీరాములును మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని పూర్తిస్థాయిలో పటిష్టం చేయాలని ఈ సందర్భంగా శ్రీరాములు వారికి సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, సిద్దాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సుధాకర్‌నేత, కృష్ణ, జగన్, కార్యదర్శులు సుభాష్‌గౌడ్, లావణ్య ఉన్నారు.

పేదలకు భరోసా సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

లింగోజిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల చెంతకు చేరుతున్నాయని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్‌కు చెందిన మధుకర్ అనారోగ్యంతో ఆసుపత్రి చికిత్స పొందిన అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును మంగళవారం రాంరెడ్డి తన కార్యాలయంలో మధుకర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మకు శ్రావణమాసం రెండో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. నాగదేవతకు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు నిరుపేదలకు వరం

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



కందుకూరులో సంపర్క అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కందుకూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో నిరుపేదలకు వరాలుగా మారాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీజేపీ సంపర్క అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలు, గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎంతో మేలు చేశాయన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీతోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శాంతిశ్రీ

కందుకూరు: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, బిడ్డ పుట్టిన గంటలోపే శిశువుకు ముర్రుపాలు ఇవ్వాలని మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బాలింతలు, గర్భిణులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. మొదటి ఆరునెలలు ఎలాంటి ఫార్ములా లేకుండా ప్రత్యేకంగా తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. తల్లిపాలు తాగే పిల్లలకు చెవి ఇన్‌ఫెక్షన్లు, శ్వాసకోశ వ్యాధులు, అతిసారం తదితర వ్యాధులు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. బాల్యంలో తల్లిపాలు తాగిన పిల్లల ఐక్యూ స్థాయి ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లి బిడ్డలకు పాలు ఇవ్వడంతో తల్లికి రొమ్ము, అండాశయ కేన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని, మరో పక్క తల్లికి బిడ్డకు మధ్య అనుబంధాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ సుల్తానా, డాక్టర్ అఖిల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర, అంగన్‌వాడీ టీచర్లు యశోధ, రేణుక, సుమతి, సౌభాగ్య, సరస్వతి, దీపా తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగురవేస్తాం



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరం, కందుకూరు మండలాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు షేక్ అజాం, షేక్ చోటామియాతో పలువురు మైనార్టీ నాయకులు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగు చెంది బీఆర్‌ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం దక్కలేదన్నారు. త్వరలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి భారీ చేరికలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతర్ల అంబయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఆనందం, శివగంగ ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు మునగపాటి నవీన్, నిమ్మగూడెం సుదీర్ గౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అదిల్ అలీ, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

కందుకూరు: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ 375వ జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్ స్వామిగౌడ్, డాక్టర్ రామారావు హాజరవుతున్నారన్నారు. మండలం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రమేశ్‌గౌడ్, యుగేంధర్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, రవీందర్‌గౌడ్, తిరుపతిగౌడ్, కృష్ణగౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

వనస్థలిపురం: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో జరిగే అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, నాయకులు గోవిందచారి, కాలనీ నాయకులు నరసింహారావు, యాదగిరి పాల్గొన్నారు.

వరద కాలువలో రసాయన వ్యర్థాలు కలపొద్దు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఆటోనగర్ పారిశ్రామికవాడ వద్ద వరద కాలువలోకి రసాయన వ్యర్థాలు కలిపితే చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. మన్సూరాబాద్, నాగోలు డివిజన్ల పరిధిలోని ఏడు కాలనీల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి సమస్యపై వినతిపత్రం అందజేశారు. గత మూడు నెలలుగా వరదకాలువలో రసాయన వ్యర్థాలు, మురుగు నీరు పారుతుండటంతో దుర్వాసనతో చర్మ వ్యాధులు వస్తున్నాయని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఇలాగే సమస్య ఏర్పడితే ఆటోనగర్‌లోని ప్రతి షెడ్డును పరిశీలించామని, అదేవిధంగా ఆటోనగర్ డంపింగ్‌యార్డ్ రోడ్డులో సీసీ కేమారాలను ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారం అయ్యిందని గుర్తుచేశారు. ప్రస్తుతం సమస్య పునరావృతం అవుతుందని మరోసారి ఆటోనగర్ పారిశ్రామికవాడ అధికారులు, జీహెచ్‌ఎంసీ, ఫారెస్ట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని సీసీ కెమెరాలను పునరుద్ధరణ చేయిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కత్తుల రాంబాబు, కమాలకర్‌రావు, మధు, ప్రవీణ్, అజయ్, కిషోర్, జనార్ధన్, శ్రీనివాస్, రమేష్, జయరాంరెడ్డి, సైదులు, లింగప్ప ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



కాలనీలో పర్యటిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని, సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నానని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానికుల కోరిక మేరకు డివిజన్ పరిధిలోని ఎన్‌టిఆర్‌నగర్, శీలం కాలనీలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. సీసీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వర్షాల కారణంగా నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సీసీ రోడ్డు పనులకు ప్రతిపాదనలు రూపొందించి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ పైపులైన్ సరిగ్గా లేకపోవడంతో డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతున్నాయని నూతన పైపులైన్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్‌వైజర్ లోక్‌నాథ్, శీలం శ్రీరాములు, మన్మోహన్‌రెడ్డి, శీలం లక్ష్మయ్య, మధుసూదన్‌రెడ్డి, అంజయ్య, రాజు, శీలం విజయ్, శ్రీకాంత్ రెడ్డి, శివయ్య, ప్రశాంత్, ఎస్‌ఎఫ్‌ఐ మహేందర్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

రాజేంద్రనగర్: వినాయక ఉత్సవాల సందర్భంగా పత్తికుంట, పల్లె చెరువుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సేవా సమితి అధ్యక్షులు వై.శ్రీధర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్సవ సమితి ప్రతినిధులు, కమిటీ సభ్యులతో కలిసి రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి సర్కిళ్లలోని పత్తికుంట, పల్లె చెరువుల మరమ్మతులు, చెత్త చెదారం తొలగింపు, లైటింగ్ సదుపాయం, మండపాల వద్ద పరిశుభ్రత, భక్తులకు మంచినీటి సదుపాయం తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు.



డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

శంషాబాద్: పట్టణంలోని చెన్నమ్మ హోటల్ నుంచి కొత్వాల్‌గూడ వైఆర్‌రెడ్డి ఫాం హౌస్ వరకు హెచ్‌ఎండీఏ నిధులు రూ. 3.98 కోట్లతో చేపడుతున్న రహదారి పనులను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కొత్వాల్‌గూడ వాసులు ఇటీవల ఎమ్మెల్సీని కలిసి బస్తీ వరకు రహదారిని విస్తరించాలని కోరడంతో ఆయన నిధులు విడుదల చేయించారు. మరిన్ని నిధులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు.

వేతన సవరణ చేయాలని వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న గ్రూప్‌-4 ఉద్యోగులు

బడంగ్‌పేట్: గ్రూప్‌-4 ఉద్యోగుల వేతన సవరణ చేసి ఆదుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ పీఎస్సీ నుంచి గ్రూప్‌-4 కింద ఎంపికయ్యామన్నారు. మాకు ఇచ్చిన విధుల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, రేషన్‌కార్డుల సర్వే, ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్స్, ట్రేడ్ లైసెన్సులు, శానిటేషన్, భువన్ సర్వే, ఎల్‌ఆర్‌ఎస్ తదితర బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మున్సిపాలిటీలకు, కార్పొరేషన్ల రెవెన్యూ పెంచడానికి కీలకపాత్ర పోషిస్తున్నామని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ల కంటే గ్రూప్‌-4 ఉద్యోగుల వేతనాలు తక్కువగా ఉన్నాయని, వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డిగ్రీతో నియమితులైన గ్రూప్‌-4 ఉద్యోగులకు ఇంటర్‌తో వస్తున్న జూనియర్ అసిస్టెంట్ల కంటే తక్కువ వేతనాలు అందించడం సరికాదన్నారు. గ్రూప్‌-4 ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు మంత్రికి విన్నవించారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి పెద్దచెరువు కట్టకు రెండు వైపులా దిగువన ఉన్న సిర్లాహిల్స్, లెనిన్‌నగర్ శ్మశానవాటికల వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపునీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇదివరకే గుంతలు తేలి ఉండడం, దీనికి తోడు కురుస్తున్న వర్షాలకు నీరు చేరడంతో ఇరువైపులా రోడ్డు చెరువును తలపిస్తోందని ఆరోపిస్తున్నారు. నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, రాత్రి వేళల్లో చెరువు కట్ట మీదుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు గుంతల వద్ద కిందపడిన సంఘటనలు ఉన్నాయని వాపోతున్నారు. కట్టకు రెండు వైపులా వర్షపు నీరు నిల్వకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సమీప కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



లెనిన్‌నగర్ శ్మశానవాటిక వద్ద చెరువు కట్ట దిగువన చెరువును తలపిస్తున్న రహదారి

బస్తీ దవాఖానాలో ఆరోగ్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బస్తీ వాసులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీలో బస్తీ దవాఖానా ప్రాంగణంలో మంగళవారం ఆయుష్మాన్ భారత్ టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ పాపారావు పర్యవేక్షణలో స్థానిక ఇంటిగ్రేటెడ్ హెల్త్ సెంటర్(ఐహెచ్‌సీ) ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. షుగర్, హెచ్‌ఐవీ, ఎక్స్‌రే, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ ఎండీ రహీం మాట్లాడుతూ టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధి అని అన్నారు. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నరేష్‌కుమార్, టీబీ హెచ్‌బీ మధుబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ గీతాలు, శ్రీనివాసులు, రమ్య, నాజిమ్మ, టీబీ అలర్ట్ ఇండియా ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ కిరణ అర్బన్ హెల్త్ సెంటర్ స్టాఫ్ నర్స్ జ్యోతిరవి కుమార్, ఆయుష్మాన్ భారత్ బీడీ ప్రతినిధులు, ఆశావర్కర్లు లక్ష్మి, రూప, నాగవేణి, అనురాధ, స్థానికులు ఏర్వ కుమారస్వామి, అదేట్ల బాలు, దస బాలరాజ్, గోంత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంపు కొడుతున్నా..

స్పందించరా?



ఎన్టీఆర్‌నగర్‌లో ఇలా..

దిల్‌సుఖ్‌నగర్: అధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యంతో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆర్‌కేపురం, మలక్‌పేట్, సైదాబాద్, అజంపురం, ఐఎస్ సదన్, అక్బర్‌బాగ్, ఛవుణీ, మాదన్నపేట్ తదితర కాలనీల్లో భారీగా వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. దీనికి తోడు డ్రైనేజీ పొంగడంతో మురుగు ఏరులై పారుతూ నడిచేందుకు వీలులేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు.ఆర్‌కేపురం, సరూర్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట్, సింగరేణి, కాలనీ, ఎన్టీఆర్‌నగర్, తీగలగూడ, భగ్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో గతకొన్ని రోజుల వ్యవధిలోనే అనేక మంది డెంగీ వ్యాధిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, పేరుకుపోతు్న చెత్త చెదారంతో పలు కాలనీలలో విష జ్వరాల విజృంభిస్తున్నా సర్కిల్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ మురుగు గుంటలుగా మారడంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.



హరిపురి కాలనీ రోడ్డు నెంబర్‌-3 వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలు



సెరినగర్ కాలనీలో ఇళ్ల మధ్య పొంగిపొర్లుతున్న డ్రైనేజీ